ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక: 13-4-1997

# తీర్థం

నేను ఊరు చేరేసరికి, మునిమాపు వేళయింది. రచ్చబండ దగ్గర తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ రాయుడు, ఇంకా కొంతమంది నా కారు చూడగానే మర్యాద పూర్వకంగా లేచి నిలబడి స్వాగతం చెప్పారు.

పరిచయాలు, పలకరింపులు అయ్యాక తిరుపతి రెడ్డి, "రాండి! ఎప్పుడనగా బయలు దేరారో మా ఇంటికి వెడదాం. స్నానం, భోజనం అయ్యాక, నింపాదిగా మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

నేను టైం చూసుకున్నా.

"ఈ రాత్రికి ఉండక తప్పదా?" అడిగాను.

అందరి మొహాల్లో నిరాశ కన్పించింది.

"క్షణాల్లో తేలే సమస్యగాదు. అలా అయితే మిమ్మల్ని ఇంతదూరం రప్పించేవాళ్ళం కాదుగా" - తిరుపతిరెడ్డి మాటల్లో చనువు, సమస్య తీవ్రత, వాళ్ళందరూ నా కోసం ఎదురు చూడటంలో గల ఆంతర్యం సూచనగా కనిపించాయి.

పైగా నేను దాదాపు పదేళ్ళ తరువాత ఊళ్ళోకి రావడం, వచ్చిరాగానే క్షణాల మీద తిరుగు ప్రయాణం కావడం, అక్కడి వాళ్లకు మనస్తాపం కలిగించేదిగా నా కనిపించింది.

జిల్లా కలెక్టరు నా హోదా, పదవి గమనించి ప్రభుత్వ వాహనం ఇచ్చి, వినయంగా అడిగాడు - 'నన్ను మీతో రమ్మంటారా' అని.

"వద్దు" అని చెప్పాను.

కారణం అతనికి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక. సమస్య వ్యక్తిగతం కావడం వల్ల.

ప్రభుత్వ వాహనం ఈ రాత్రికి నాతో వుంచుకోవచ్చు. కానీ రాత్రికి డిన్నరుకు ఆయన ఆహ్వానించాడు. పల్లెటూళ్ళో, ఎంత పుట్టిన ఊరైనా,రాత్రి గడపడం నాకు ఇష్టం లేదు. ఇవన్నీ ఆలోచిస్తుండగానే -

తిరుపతిరెడ్డి,"ప్లీజ్ రాండి, మీకే అసౌకర్యమూ లేకుండా మా ఇంట్లో వుండవచ్చు" అని మరీ అభ్యర్థించాడు.

ఈసరికి కొంతమంది పిల్లలు, ఊళ్ళో జనం, నన్నూ, కారునీ చోద్యంగా చూడసాగారు.

ఆ రాత్రి ఆ ఊళ్ళో వుండేందుకే నిశ్చయించుకున్నా.

"రేపు ఉదయం వెడదాం" అన్నా డ్రైవరుతో.

"మీ ఇష్టం సార్..... వీలయితే సారుకి కబురంపండి" అన్నాడు డ్రైవర్.

"అలాగే".

ఆ రాత్రికి తిరుపతిరెడ్డి ఇంట్లో మకాం.

నేనెరిగినది పెంకుటిల్లు, ఓ ప్రక్కన గడ్డివాము, గొడ్ల కొష్టం...... ఇదీ తిరుపతిరెడ్డి ఇల్లు.

కానీ ఇప్పుడవన్నీ లేవు.

రెండతస్థుల మేడ. చుట్టూ కొబ్బరి చెట్లు, పూల తోట, గదులన్నీ మొజాయిక్ ఫ్లోరింగ్. మేడ మీద ఓ గది ఎ.సి. ఇవన్నీ మారుమూల గ్రామంలో - అదీ నా చిన్నప్పుడు పుట్టిన గ్రామంలో.

ఆ రాత్రి విందుకి చాలా భారీగానే ఏర్పాట్లు చేశాడు.

విదేశీ మద్యం, మాంసాహారం, ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేశాడు.

ఆ విందులో నేనూ, తిరుపతిరెడ్డి, రాయుడు, గ్రామంలోని బ్యాంక్ మేనేజర్ - అంతే!

తిని తాగే సమయంలో సమస్య మొత్తం నా ముందుంచాడు.

కొంత నాకు తెలుసు.... మరికొన్ని వివరాలు అప్పుడు తెలిశాయి.

"గోపాలాచార్యులు ఎలా వున్నారు?"

"ఆయన పండుటాకులా వున్నారు. ఆయన భార్య - ఆయన ఇద్దరే వుంటున్నారు."

"వందకు చేరాడా?"

"చెప్పలేం! రోగం, రొష్టులేవు. వార్ధక్యం తప్ప".

నాకు తెలిసిన నాటికే గోపాలాచార్యులు నడి వయస్సులో వున్నాడు.

కావడిబద్ద లాంటి శరీరం, నుదుటున నామాలు, పిలక.... ఎప్పుడు నవ్వుతూ వుండే రూపం ఆయనది.

ఆలయంలో అర్చకత్వం... అది గాక మాన్యంలో వ్యవసాయం - ఇదీ ఆయన జీవన

సరళి. ఒకరి జోలికి పొయ్యే మనస్తత్వం కాదు.

సంక్రాంతి సమయంలో చుక్కపొడిచే సమయానికి ఆయన గొంతు.... చిడతల చప్పుడు, పడే మంచునీ, నిశ్శబ్దంగా వాతావరణాన్నీ ఛేదించుకొని లీలగా, అలల లాగే వినపడేది.

జయదేవుని అష్టపదులు, త్యాగరాజ స్వామి కృతులు, రామదాసు కీర్తనలు, కృష్ణకర్ణామృతంలోని తరంగాలు.... ఇలా పాడుతూ వీధుల వెంట నెత్తిన అక్షయపాత్ర, చేతిలో చిడతలు, వళ్ళంతా నామాలు, మెళ్ళో పూలదండ, కాళ్ళకు గజ్జెలతో వీధుల వెంట తిరుగుతుంటే సాక్షాత్తూ శ్రీ మద్రామానుజులవారు తిరుగుతున్నట్లు భావన కలిగేది.

ఆయన హరినామ సంకీర్తనతో ఇళ్ళు - వీధులు మేల్కొనేవి. వీరు వారని లేకుండా, ఆయన రాక కోసం, ముంగిట పిల్లలు, పెద్దలు గిన్నెల్లో ధాన్యం, పూలు పట్టుకొని నిల్చునేవారు.

భక్తిపరులు, ఆధునికులు, అన్ని మతాలు, కులాల వారు ఆయన శ్రద్ధకు, నిజాయితీకి, ప్రసన్నమైన రూపానికీ, తాదాత్మ్యం చెందుతూ చేసే హరినామస్మరణకు శిరః కంపనం చేసేవారు. వినమ్రులై నమస్కరించేవారు. ధనుర్మాసం అయిపోతే ఆయన ఆలయంలో కనిపిస్తారు.

చుట్టుపట్ల గ్రామాలకు ఆయనకు అవినాభావ సంబంధం వుంది. భోగి, సంక్రాంతి, కనుమ ఏదో రోజు ఆయన ఆ గ్రామాలకు వెళ్ళాల్సిందే. లేకపోతే ఆ ఊరి పెద్దలు పని కట్టుకుని వచ్చి, "అయ్యా! అయ్యవారూ, తమరు ఈసారి మా గ్రామం రాలేదు. మాకెంతో వెలితిగా వుంది. సంవత్సరానికి ఓసారి రాండి! మీరు నడవలేకపోతే బండి పంపుతాం లేదా మేం వస్తాం, మీకు తోడుగా!" అని ప్రాధేయపడ్డ రోజులూ వున్నాయి.

గోపాలాచార్యులు నిష్టగల అయ్యవారు. ఎంత కష్టకాలం వచ్చినా, అనారోగ్యం వచ్చినా భావనారాయణస్వామికి నివేదన చెయ్యందే పచ్చి మంచితీర్థం ముట్టరు. ఏదన్నా అవాంతరం వస్తే, ఎక్కణ్ణుంచన్నా మరో అయ్యవారిని తెచ్చి నివేదన చేయించేవారు.

అంతటి దీక్ష ఆయనది.

అందుకే ఆయనంటే ఊరి వారికి గౌరవం, ఆదరణ -

ఇవన్నీ గుర్తొచ్చాయి.

ఈ గతకాలపు జ్ఞాపకాలు. అనుభవాల మధ్య "సార్, దేవదానం వచ్చా"డని కబురొచ్చింది.

"వీడింకా రాలేదేమాని ఆలోచిస్తున్నా, వచ్చాడు! వాడి మాటలు వినండి" - తిరుపతి రెడ్డి, తదితరులు క్రిందకు వెళ్ళారు!

దేవదానం వచ్చాడు. చిక్కి శల్యమై వున్నాడు. కానీ కళ్ళల్లో వెలుగు, మొహంలో తేజస్సు మాత్రం అలాగే వుంది.

"రా ఇలా బల్లమీద కూర్చో" అన్నా.

"స్వామీ! అయినా మీరు అన్నారు గనుక, ఇలా కూర్చుంటా" అని నేలపై పై బట్ట వేసుకుని కూర్చున్నాడు.

"కచేరీలు చేస్తున్నావా?"

దేవదానం తలొంచుకున్నాడు ఓ క్షణం తర్వాత ఊపిరి పీల్చుకుని, "స్వామీ వయ సొచ్చేసింది. ఇది వరకులాగా, దమ్ము పట్టలేకపోతున్నా. నడిస్తే ఆయాసం వస్తున్నది, పైగా ఇప్పుడు నాదస్వరం ఎవరూ కోరుకోవడం లేదు".

దేవదానం నాదస్వర విద్వాంసుడు. అయితే అతగాడి కులం, మతం, అతడికి ఆ విద్యలో తగినంత ప్రోత్సాహం కన్పించలేదు. కుల వృత్తిగా మగ్గం వుంది. దాంతో జీవయాత్ర చేస్తున్నాడు.

"ఇంకా ఏమిటి సంగతులు?"

దేవదానం కొన్ని క్షణాలు మాట్లాడలేదు. ఊరు కూడా మాటు మణిగింది. క్రింద నుంచి టీవీలోంచి సినిమా సంభాషణలు, సంగీతం వినపడుతున్నాయి.

"విషయం మీకు తెలుసుగదా!" అన్నాడు దేవదానం.

"తెలుసు!"

"ఈ గొడవ లేకపోతే, మా పెద్దోడి దగ్గరకెడదామనుకున్నా. మీకు తెలుసుగా! వాడు పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు."

క్షణం మా మధ్య నిశ్శబ్దం ఆవరించింది.

"ఊరు మారిపోయింది స్వామీ! చదువుకున్నోళ్ళు పల్లెలు విడిచి వెడుతున్నారు. పొలం వున్న వాళ్ళు బలగం వున్నవాళ్ళు పెత్తనం చేస్తున్నారు. భూస్వాములు, కూలీలు, వీళ్ళే మిగిలారు ఇప్పుడు. పైగా ఊరంతా రెండుగా విడిపోయింది. ఒకరొక పార్టీ అంటే, ఇంకొకరు ఇంకో పార్టీ. తాగడం, పేకాటలు, లంజరికం ఇవే ఇప్పుడు మా ఊళ్ళో మిగి లింది."

దేవదానం చెప్పేది, నే పత్రికల ద్వారా తెలుసుకున్నదే!

నే ఉన్నప్పుడు, పాతికేళ్ళనాడు, ఈ వూరికి కరెంటు లేదు. బస్సు రాదు. రేడియో కూడా అరుదుగా మోతుబరుల ఇళ్ళల్లోనే వుండేది. చదువుకు వేరే ఊరు నడచి వెళ్ళొచ్చే వాళ్ళం!

హరి కథలు, తోలుబొమ్మలాటలు, ఎప్పుడో ఆడే పౌరాణిక నాటకాలు - ఇవే వినోదాలు.

ఇప్పుడు రేడియో లేని ఇల్లు లేదు. కరెంటు వచ్చింది. టీవీలొచ్చాయి. బస్సులొచ్చాయి. బోరింగులొచ్చి వ్యవసాయం లాభసాటి వ్యాపారమైంది. పత్తి, పొగాకు, మిర్చి, వ్యాపారపు పంటలు బాగా పండుతున్నాయి. బ్యాంకు శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాల

శీతలీకరణ కేంద్రం, హైస్కూలు - ఇలా అన్నీ ఆధునిక వసతులు వచ్చాయి.

కానీ -

దేవదానం మాటల్లో చెప్పాలంటే -

"స్వామీ! డబ్బు, కులం, రాజ్యమేలుతున్నాయి. మనుషుల్లో మంచితనం పోయింది. సంస్కారం పోయింది. పెద్దలంటే గౌరవం లేదు, స్వామీ! పూర్వం దారిద్ర్యం వుండేది. అది వుంటేనే బాగుండేదేమో. బ్రాహ్మల వీధి కెడితే పురాణం వినపడేది. భోగం వాళ్ళ ఇళ్ళ దగ్గర సంగీతం, నృత్యం వుండేది. కులం అంటే గౌరవం వుండేది. ఇప్పుడేముంది బాబూ! ఏం లేదు. జీవితం వ్యాపారమైంది. మనిషికి మార్కెట్‌లో విలువ కడుతున్నారు. స్వామీ! సమస్య మీకు తెలుసు. ఇందులో నాకేం స్వార్థం లేదు! కానీ నన్నంతా వేలెత్తి చూపుతున్నారు. నాకే దేవుడైనా ఒకటే! మరి వాడికి ఎందుకు, ఈ బుద్ధి పుట్టిందో తెలియదు. మీరెలా నిర్ణయిస్తే, అది కాదనను!"

దేవదానం, పై గుడ్డతో, కళ్ళు తుడుచుకుంటూ నమస్కారం చేసి వెళ్ళాడు!

నాకు క్షణం, గుండె కలుక్కుమంది.

దేవదానం చెప్పింది నిజమే!

ఊరు మారిపోయింది. మార్పు సహజం, కానీ, ఏ దిక్కుగా గ్రామ జీవనం సాగుతున్నదో నాకు అర్థం కావడం లేదు.

తిరుపతిరెడ్డి వచ్చాడు.

"దొంగముండా కొడుకు. దేవుడి మాన్యం కాజెయ్యాలని ఎత్తు. చూడటానికి మంచి వాడిగా, పెద్దమనిషిగా కనబడతాడు గానీ, అమ్మో గుండెలు తీసిన బంటు దేవదానం" అన్నాడు.

నేనేం సమాధానం చెప్పలేదు. తిరుపతిరెడ్డి స్థానికుడు. నిత్యం, ఊర్లోని వ్యక్తులతో, సంఘటనలతో సంబంధం వున్నవాడు. అతని అభిప్రాయం నిజం కావచ్చు కూడ.

"గోపాలాచార్యులేమంటారు?"

తిరుపతిరెడ్డి నావైపు నిశితంగా చూశాడు నా ప్రశ్నకు.

"అసలిదంతా ఆయన వల్లనేగా వచ్చింది!"

"ఆయనేమంటాడు?"

"ఏమీ అనడు, గుండ్రాయిలా మాట్లాడడు. ఎన్నో విధాల చెప్పా. పదిమందిచేత చెప్పించా! నా వల్ల కాకనే గదా, నిన్ను రమ్మన్నది!"

"కొడుకులు ఏమంటారు?"

"వాళ్ళు ఎప్పుడో చేతులెత్తేశారు. అయినా ఒకడు అమెరికాలో వుంటే, ఇంకొకడు జర్మనీలో. వాళ్ళు ఈ దేశం రారు. ఈ ముసలాయన కొడుకుల దగ్గర కెళ్ళడు."

"ఈయన మంచాన పడ్డారా!"

"నాకు నమ్మకం లేదు. వాళ్ళు ఈ దేశం రాక పదేళ్ళయింది. అయినా ఇక్కడేముంది? గుడి, మాన్యం. అవన్నీ మీవేగా!"

ఆ రాత్రి కరిగిపోతుండగా, చాలా విషయాలు మాట్లాడుకున్నాం. నాకు చాలా రోజుల తర్వాత దొరికిన విశ్రాంతి, అది ఓ రకంగా!

చివరగా, తిరుపతిరెడ్డి చెప్పేదొకటే,

"తెల్లారితే నువ్వు నీ దారిన వెడతావు. వెళ్ళేలోగా, సమస్య తేల్చి వెళ్ళు. నువ్వు వెళ్ళాక ఊళ్ళో వాళ్ళు నన్ను కాకుల్లాగా పొడుస్తారు. వాళ్ళకు పిచ్చి నమ్మకం, నే చెబితే నువ్వు వింటావని! పైగా రామ మందిరం, బాబ్రీ మసీదు గొడవొచ్చాక, ఊళ్ళో పట్టుదల ఎక్కువైంది. ఇదివరకు రూపాయి ఇవ్వని వాళ్ళు, గుడి బాగుకోసం వేలిచ్చారు. మంచికో, చెడుకోగానీ, ప్రజల్లో మతవిశ్వాసం, దేవుడంటే భక్తీ పెరిగాయి."

తెల్లవారుతుండగా నిద్ర పట్టింది. కానీ, మసీదులోంచి, గుళ్ళోంచి, అల్లాహో అక్బరన్న మాటలు, గంటలు ఓకేసారి మైకుల్లోంచి వినపడటంతో మెలకువ వచ్చేసింది.

పైగా రాత్రి కడుపులో పడ్డ మందు, మాంసం, నిద్ర లేకపోవడంతో, తల దిమ్మెక్కింది.

స్నానం చేసి, ఫలహారం చేసి ప్రయాణానికి సిద్ధమైనా.

అప్పటికే ఊరి పెద్దలు చాలామంది వచ్చారు - 'పంతులుగారబ్బాయి'(నన్ను)ని చూద్దామని!

కొందరు గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మరికొందరు నా గురించి అడిగారు. ఢిల్లీలో చాలా పెద్ద ఉద్యోగమనీ, వాళ్ళల్లో వాళ్ళు సమాధానమూ చెప్పుకున్నారు.

నా వయస్సు వాళ్ళు, నాతో తిరిగినవాళ్ళు కొందరే ఉన్నారు. వాళ్ళు పలకరింపుగా నవ్వారు. మా మధ్య అంతరాలు పెరిగాయి మరి!

భావనారాయణస్వామి ఆలయానికి వెళ్ళా. అది మా తాత ముత్తాతల నుంచి, వంశ పారంపర్యంగా సంక్రమించిన ఆస్తి. అందుకు నేను ధర్మకర్తను.

కంకర రోడ్లు, వీధి దీపాలు, అక్కడక్కడ పంపులు వెలిశాయి. చాలా ఇళ్ళు డాబాలయి నాయి. షాపులు వచ్చాయి.

అన్నీ చూసుకుంటూ ఆలయంలోకి వెళ్ళా.

గోపాలాచార్యులు, ఆయన భార్య గుడి మండపంలో కూర్చొనున్నారు, ఆది దంపతుల్లా.

వెళ్లి నమస్కరించా!

గోపాలాచార్యుల గొంతులో వణుకు వచ్చింది. ఆశీర్వదించాడు.

"మళ్ళీ వచ్చేసరికి ఉండనేమో. ఊళ్లో వాళ్ళు గుడి బాగుచేయించారు. కానీ గుళ్ళో దీపం పెట్టేవాళ్ళు లేరు! ఏమిటో, కాలం మారిపోయింది. పిల్లలు బాగున్నారా? అప్పు డప్పుడూ వస్తుండండి."

"బాగున్నారు!"

గోపాలాచార్యుల భార్య మంగతాయారు, "నాయనా! ఆయనకు చెవుడొచ్చింది! వినపడదు. ఆయన చెప్పేది వినడమే!" అంది.

గోపాలాచార్యులు అవునన్నట్లు నవ్వారు, ఆకాశానికి నమస్కరించి.

గర్భగుడి బయట ఓ కుర్రాడు, పది పన్నెండేళ్ళ వాడు, పాత ఎర్రటి పంచ కట్టుకుని, నామాలు, పిలకతో కూర్చుని ఏకాగ్రతతో మంత్రాలు వెల్లవేస్తున్నాడు.

"వాడే! దేవదానం కొడుకు" అని చెవిలో చెప్పాడు తిరుపతి రెడ్డి.

"గుళ్ళోకి పోదాం పదా! అర్చన చేయిద్దాం"

గోపాలాచార్యులు భార్య ఆసరాతో ముందు నడవగా, ఆయన వెంట వెళ్ళా!

"వీడు రామానుజులు. పూర్వ జన్మసుకృతం! వెధవకి అర్చకత్వం పట్టుబడ్డది. నాకు చేతకాక వీడికి అన్నీ నేర్పా!" అన్నాడు గోపాలాచార్యులు.

రామానుజులు, మా గోత్ర నామాలతో అర్చన చేశాడు. మంచి గొంతు, స్వచ్ఛమైన ఉచ్ఛారణ! హారతిచ్చి, తీర్థం తీసుకొచ్చాడు.

"తీసుకో" - ఆజ్ఞ, ఆదేశం, అభ్యర్థనలా చెప్పాడు గోపాలాచార్యులు.

తీసుకున్నా, తీర్థం, ప్రసాదం కళ్ళ కద్దుకుని.

ఆలయ ప్రాంగణంలో జనం నన్ను, నా చర్యలను వింతగాను, కుతూహలంగానూ చూడసాగారు.

బయలుదేరి వస్తుంటే మంగతాయారమ్మ నన్ను పక్కకు పిలిచి -

"నాయనా! ఆ కుర్రాడు ఈ వయస్సులో మాకు తోడునీడ. ఆయనకూ ఎందుకో అభిమానం కలిగింది. వెంట త్రిప్పుకుని, మంత్రాలు, మడీ, ఆచారం నేర్పారు. ఆ వెధవా శ్రద్ధగా నేర్చుకున్నాడు. ఏనాటి ఋణానుబంధమో మాతో కలిసిపోయాడు. ఊళ్ళో వాళ్ళకు ఇది కంటగింపుగా వుంది. నేనా ఆడదాన్ని. ఆయన మాట కాదనలేను. ఊళ్ళో వాళ్ళు ముఖ్యమే! కానీ ఎవ్వరూ కాలం మారుతోందని గుర్తించడం లేదు. ఏం చేస్తావో నీ ఇష్టం" అని చెప్పింది.

కాలం మారుతోంది. విలువలు మారుతున్నాయి. నరులు, నదులు, జీవిత గమనాన్ని మార్చుకుంటూ ముందుకు సాగుతున్నాయి.

తిరుపతిరెడ్డి, ఆశగా నా నిర్ణయం కోసం చివరిదాకా ఎదురు చూస్తూనే వున్నాడు.

నేను మళ్ళీ ఈ వూరు రావడం ఇప్పట్లో కుదరదు. అది అతనికీ, నాకూ తెలుసు.

"రెడ్డీ! రామానుజులు ఇచ్చిన తీర్థం తీసుకున్నా.... ఇంకా నిర్ణయం నీకు అర్థం కాలేదా?"

తిరుపతిరెడ్డి మాట్లాడలేదు.

- నేను వచ్చేశా. ●